

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి -నెల్లూరు : నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రతి 14 రోజులకు ఒకసారి ఫాగింగ్ ప్రక్రియను అమలు చేస్తూ, ఆయిల్ బాల్స్ పిచికారి, గంబుజియా చేప పిల్లల పెంపకం తదితర కార్యక్రమాలతో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ వై.ఓ. నందన్ సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్ పి. నారాయణ సూచనల మేరకు హ్యాండ్ ఫాగింగ్ మెషిన్ల ద్వారా ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు మాత్రమే ఫాగింగ్ ప్రక్రియను అన్ని డివిజన్లలో పూర్తి చేయాలని సూచించారు.ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, మలేరియా విభాగం అధికారి జిజియా బాయి, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, శానిటేషన్ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు



మాట్లాడుతున్న కమిషనర్

కలువాయిలో తమ్ముళ్ల భూమాయ..!

130 ఎకరాలకు ఎసరు పెట్టే ప్రయత్నం -భూ చదును పనులు ప్రారంభం

అధికారం ఉన్నప్పుడే కొంత భూమి, డబ్బు, వెనుకేసుకుందామను కున్న నాయకులు అందుకు అనుగుణంగా పావులు కదుపుతున్నారు. కొందరు రెవెన్యూ అధికారులు ఇందుకు సాయపడుతున్నారనే విమర్శలొస్తున్నాయి. వెంకటగిరి మీదుగా జాతీయ రహదారి నిర్మాణం జరగడంతో అక్కడ భూములకు రెక్కలొచ్చాయి. దీనిని ఆసరా చేసుకున్న కొందరు అధికారపార్టీ నేతలు సుమారు 130 ఎకరాలకు ఎసరుపెట్టినట్లు తెలుస్తోంది. నకిలీ పత్రాలు సృష్టించి, కాజేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారనే విమర్శలున్నాయి. వెంకటగిరి నియోజకవర్గం కలువాయి మండలం, తెలుగురాయపురం గ్రామంలో జరుగుతోన్న ఈ తంతును స్థానికులు ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అధికార బలంతో బుధవారం ఆ భూముల్లో చదును చేయడానికి జెసిబిలు, ప్రొక్లెయినర్లు దింపినట్లు తెలిసింది. మైనింగ్, ఇసుక, సిలికా, గ్రావెల్ దందాలతో తలలు పట్టుకుంటున్న టిడిపి పెద్దలు ఇప్పుడు భూ దందాలు బయటకు రావడంతో ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్నారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపి, టిడిపి నాయకులు అధికారం అడ్డంపెట్టుకొని ప్రభుత్వ ఆస్తులను కొల్లకొడుతున్నారు. ఏడాది వరకు వైసిపి నాయకులు జిల్లా వ్యాపితంగా పెద్ద ఎత్తున భూ దందాలు చేశారనే విమర్శలున్నాయి. ఉదయగిరి, వెంకటగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో జాతీయ రహదారుల నిర్మాణాలు పూర్తవుతున్నాయి. దీంతో ఈ ప్రాంతాల్లో రూపు రేఖలే మారిపోతున్నాయి. ఇదే క్రమంలో ఒకప్పుడు మెట్ట , బీడు భూములు ఇప్పుడు సిరులు పండిస్తున్నాయి. దీనిపైనా ఇప్పటి అధికారపార్టీ నేతల కన్నుపడుతోంది. ప్రజా ప్రతినిదుల నుంచి, చోటా, పేటా నాయకులు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడే మకాం వేస్తున్నారు.. తెలుగురాయపురంలో గ్రామ రెవెన్యూ రికార్డుల (ప్రకారం 585-2, 586-1,590-3,593,577,578 సర్వే నెంబర్‌లో సుమారు 130 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. రాజుపాలెం గ్రామానికి చెందిన టిడిపికి చెందిన వెంకటసుబ్బరాజు మరో 26 మంది పేరుతో డిఫామ్ పట్టాలు 2013లో పొందారు. నిరుపేదలకు ఇవ్వాల్సిన ఈ భూములు పెద్దలకు ఇచ్చారని తెలిసింది. స్థానికులకు కాకుండా అప్పటి ప్రభుత్వం అండతో నకిలీ పేరు పెట్టి, నకిలీ రికార్డులు

వివాదస్పద భూమిలో చదును చేస్తున్న జెసిబి

సృష్టించారని సమాచారం. నిరుపేదలకు ఎకరా భూమి ఇవ్వడానికి నానా ఇబ్బందులు పెట్టే రెవెన్యూ అధికారులు తప్పుడు పేర్లతో ఒకొక్కరికి పది ఎకరాలు ఇచ్చినట్లు రికార్డులు సృష్టించినట్లు సమాచారం. గ్రామస్తులు దీనిని వ్యతిరేకించడంతో వెంకటసుబ్బరాజు తమకు హద్దులు చూపించాలని హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ విషయం కోర్టులో ఉన్నట్లు సమాచారం. కలువాయి మండల పరిధిలోని తెలుగురాయపురం మీదుగా జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణ జరిగింది. ఒక్కసారిగా ఇక్కడ భూ ధరలు భారీగా పెరిగాయి. ఎకరా ప్రస్తుతం రూ. 25 లక్షల వరకు ధర పలుకుతోంది. ఇక్కడ భూమిని కాజేసేందుకు కొందరు స్థానిక నేతలతో కలిసి పన్నాగం పన్నినట్లు సమాచారం. కలువాయి రెవెన్యూ కార్యాయలంలో కొత్త రికార్డులు సృష్టించారనే విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 130 ఎకరాలు తమ పేరుపై కొత్త రికార్డులు సృష్టించి భూమిని కాజేసేందుకు కొందరు అధికారపార్టీ నేతలు పావులు కదుపుతున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల ఈ విషయమై గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తెలుగురాయపురంలో సర్వే నెంబర్ 187-5,597-2,507-1,లో 14 ఎకరాలను ఫ్రీ హోల్డ్‌లో పెట్టినట్లు సమాచారం. మిగిలిన పేరు మార్పుచేసి, పట్టాలు పొందేలా చూస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ భూమి ప్రభుత్వానిదేనని, రికార్డులు ఏం మారలేదని స్థానిక తహశీల్దారు చెబుతున్నారు. పేద గ్రామస్తులకు చెందాల్సిన ప్రభుత్వ భూమిని ఇలా కొందరు అధికారం అడ్డంపెట్టుకొని కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు వాస్తవలు గుర్తించి ప్రభుత్వం భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

వివాదస్పద భూమి చదును..!

కలువాయి మండలం, తెలుగురా యపురం గ్రామంలో వివాదంలో ఉన్న 130 ఎకరాల ప్రభుత్వ భూమిలో బుధవారం అధికారపార్టీకి చెందిన కొందరు వ్యక్తుల చదును చేసినట్లు తెలిసింది. అడ్డుదున్న మొక్కలను జెసిబి సహాయంతో తొలగించారు. కోర్టులో వివాదం నడుస్తోంది. స్థానిక రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమిగా చెబుతున్నారు. ఈ విషయాలు పట్టించుకోకుండా కొందరు వ్యక్తులు అడ్డుఅదుపు లేకుండా వ్యవహరి స్తుండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులకు చెందాల్సిన ప్రభుత్వ భూమిని కొందరు అక్రమిస్తున్నారని, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

పౌర సేవలపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గుర్తించిన అంశాలపై వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ రెవిన్యూ అధికారులకు సూచించారు. బుధవారం తిక్కన ప్రాంగణంలో కందుకూరు, కావలి రెవిన్యూ డివిజన్ పరిధిల్లోని తహశీల్దార్లతో రీ సర్వే డిజిటలైజేషన్, నోషనల్ ఖాతాలు, నీటి తీరువా పన్ను వసూలు, సిటిజన్ సర్వీసెస్ తదితర రెవిన్యూ సంబంధిత విషయాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రెండవ విడత ఎంపికైన గ్రామాల్లో రీసర్వే సక్రమంగా పూర్తి చేయాలని, ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామాల్లో తలెత్తిన సమస్యలను పరిగణలోకి తీసుకుని మరింత జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీ పూజ, డిఆర్వో ఉదయభాస్కరరావు, కావలి ఆర్డిఓ వంశీకష్ణ, సర్వే ఎడి నాగశేఖర్ ఉన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి

వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

ఆదివాసీలను అంతం చేసే పేరుతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు నిర్వహించాలని వామపక్షపార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం నగరంలోని బాలా రామచంద్రారెడ్డి భవన్‌లో వామపక్షపార్టీలు, ప్రజాసంఘాలు సంయుక్త ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మధ్యభారత దేశంలో కోట్లాది రూపాయల విలువ చేసే ఖనిజ సంపద ఉన్నదని విషయం జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో అందరికీ తెలిసిందే అన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో విపరీతమైన ఖనిజ సంపద ఉందని, దీనిని జాతీయ అంతర్జాతీయ స్థాయి కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. మావోయిస్టులను నిర్మూలిస్తామంటూ వేలాది మంది సైనికులను ఉసికొల్పి ఆదివాసీయులపై యుద్ధం ప్రకటించడం అత్యంత దారుణమన్నారు. ఈ చర్యలను వెంటనే నిలిపివేసి శాంతి చర్చలు నిర్వహించాలని నాయకులు డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణిచివేయాలంటే దేశంలోని ఏ రాజకీయ పార్టీకి సాధ్యం కాదన్నారు. పోరాటాలు సంఘం కార్యకర్త నాయ్యవాది అబ్బయ్యరెడ్డి, వాపపక్షపార్టీల నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ సహాయ కార్యదర్శి మాలకొండయ్య, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సాగర్, ఎల్లంకి వెంకటేశ్వర్లు, పలువురు ప్రజాసంఘాల నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

రామాయపట్నంలో మాక్ డ్రిల్

ప్రజాశక్తి- గుడ్లూరు రూరల్ : భారత్, పాకిస్తాన్ సరిహద్దు వద్ద ఉద్రిక్తల నేపథ్యంలో బుధవారం సాయంత్రం గుడ్లూరు మండలం రామాయపట్నంపోర్టులో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎవరైనా తీవ్రవాదులు వచ్చి ఎటాక్ చేస్తే ఎలా రక్షించుకోవాలని దానికి సంబంధించి ఈ మాక్ డ్రిల్ జరిగింది.ఈ కార్యక్రమంలో కందుకూరు డిఎస్‌పి బాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో గుడ్లూరు సర్కిల్ సిఐ గారేనా మంగారావు, గుడ్లూరు ఎస్ఐ సబ్ డివిజన్ సిబ్బంది, మెరైన్ పోలీస్ స్టేషన్ సిఐ శివ నారాయణ, వారి సిబ్బంది, గుడ్లూరు తహశీల్దార్ స్వర్ణ, కందుకూరు ఫైర్ ఆఫీసర్, ఫైర్ ఇంజన్ 108 అంబులెన్స్ సిబ్బంది పోర్టు వర్కర్లు పాల్గొన్నారు. విపత్కర పరిస్థితులు వచ్చినప్పుడు ఎలా రక్షించుకోవాలని విషయంపై ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

రామాయపట్నంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు

ఆర్‌టిసి బస్టాండ్ లో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రజలపై దాడి జరుగుతున్న సమయాల్లో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు, సురక్షితంగా బయటపడేందుకు నెల్లూరు ఆర్డీవో అనూష పర్యవేక్షణలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రయాణికులకు మాక్ డ్రిల్ పట్ల అవగాహన కల్పించారు.ఆర్‌డిఒ అనూష, అర్బన్ తహసీల్దార్ షఫీ మాలిక్ ఆర్టీసీ ఆర్ఎం మధుబాబు, పోలీసులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థలో వివిధ విభాగాలలో విధులను నిర్వహిస్తున్న సిబ్బంది నిబద్ధతతో తమ బాధ్యతలను నిర్వహించాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని వివిధ విభాగాలను కమిషనర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పెన్షన్ విభాగాన్ని సందర్శించిన కమిషనర్ విభాగం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సెక్రటరీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కాలువలపై నిర్మాణాలు సరికాదు..

ప్రజాశక్తి-నెల్లూరు : నగరపాలక సంస్థ పరిధిలో డ్రైను కాలువలను ఆక్రమిస్తూ సమీప గహాల వారు ఏలాంటి శాశ్వత నిర్మాణాలను చేపట్టరాదని, డ్రైను కాలువల పూడికతీత పనులకు అడ్డంకిగా ఉంటే ఇంటికి సంబంధించిన మెట్లు, ర్యాంపులు, తదితర నిర్మాణాలను తప్పనిసరిగా తొలగించి వేస్తామని కమిషనర్ వై.ఓ నందన్ తెలిపారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 7వ డివిజన్‌లో ఆయన బుధవారం పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం డి.ఈ రఘురామ్, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, శానిటేషన్ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, వార్డ్ సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు శాఖ గ్రంథాలయంలో పదోరోజు బుధ వారం వేసవి శిక్షణ తరగతులు భాగంగా కథలు చదివి వినిపించారు. అనంతరం శింగరాయకొండ జెడ్‌పిహెచ్ బాయ్స్ స్కూల్ పిటి మాల్యాద్రి విద్యార్థులకు యోగాసనాల గురించి వివరించారు. గ్రంథపాలకురాలు పి నాగ రజని పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉలవపాడు : శాఖా గ్రంథాలయం ఉలవపాడులో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు నీతి కథలు చదివించి, అనంతరం పిల్లల మానసిక ఆనందం కోసం ఖో ఖో పోటీలు నిర్వహించామని గ్రంథ పాలకుడు డి.కోటేశ్వరావు తెలిపారు. ప్రతిరోజూ ఎక్కువ మంది పిల్లలను గ్రంథాలయానికి పంపిస్తున్న వారి తల్లిదండ్రులకు గ్రంథపాలకుడు కృతజ్ఞులు తెలిపారు. ఈరోజు మొత్తం 35 విద్యార్థులు హాజరుకాగా ఐదుగురు సభ్యత్వం రుసుం చెల్లించారు. అనంతరం పిల్లలకు స్నాక్స్ పంచిపెట్టారు. యాక్టివిటీ ఫ్యాకల్టీగా ఎన్.హరిబాబు పాల్గొన్నారు.

పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోనే కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకషి మానసిక వికలాంగుల పాఠశాల రెండో బ్రాంచీలలో పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అల్లూరి వెంకట శివ సాయి. కందుకూరు పట్టణంలోన నాంచారమ్మ కాలనీలో నివాసమంటున్న అల్లూరి చంద్రశేఖర్ కనకదుర్గ కుమారుడైన వెంకట శివ సాయి తల్లి తండ్రి అయిన చంద్రశేఖర్ దంపతులు మాట్లాడారు. తమ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా వికలాంగుల మధ్య పుట్టినరోజు వేడుకలను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో నివసిస్తున్న వారందరికీ బిస్కెట్లు పంచిపెట్టారు.

పారిశుధ్య పనులు పర్యవేక్షణ

ప్రజాశక్తి-నెల్లూరు : నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం స్థానిక 4,17వ వార్డులో పారిశుధ్య పనుల పర్యవేక్షించారు. 17వ వార్డు ఆకుతోట సచివాలయం లో ఆలస్యంగా మస్టర్ కి హాజరైన సెక్రెటరీని మందలించారు. 4వ వార్డ్ జాకీర్ హుస్సేన్ నగర్, మారుతీ నగర్ ల లో పర్యటించారు.

విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్లను కలిసిన ఎస్ఇ

ప్రజాశక్తి-నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ లుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కె.గురవయ్య డైరెక్టర్ టెక్నికల్, పి. అయూబ్ ఖాన్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ను జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం తిరుపతి కార్పొరేట్ ఆఫీస్ లో డైరెక్టర్లను కలిసి పుష్పగుచ్ఛం అందచేసిన వారిలో జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. విజయన్ జిల్లాలోని అధికారులు సిబ్బంది ఉన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలంలోని మండలం చెమిడిదపాడు గ్రామ బస్టాండ్ వద్దనిర్మాణంలో ఉన్న శ్రీ పంచముఖ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి ఆలయ నిర్మాణానికి చెమిడి దపాడు గ్రామానికి చెందిన వర్ధినేని వెంకట్రావు, చంద్రిక, కుటుంబ సభ్యులు పల్లవి, సాయి చరణ్ 10 వేల రూపాయలు విరాళంఇచ్చారు.ఆ మొత్తాన్ని వెంకట్రావు ట్రస్ట్ అధ్యక్షుడు ఆలూరి వెంకట హనుమంతరావు ఇంటి వద్ద అందజేశారు. మొత్తంగా రూ. 30 వేల విరాళం వెంకట్రావు అందించారని హనుమంతరావు తెలిపారు. వారికి ఆయన ట్రస్ట్ తరుపున కతజ్ఞతలు తెలిపారు.

జిల్లాకో స్పోర్ట్స్ కాంప్లెక్స్, స్టేడియంలను నిర్మిస్తాం..

క్రీడల కోటాలో డిఎస్‌సిలో 421 టీచర్ పోస్టులు - క్రీడల మంత్రి ఎం.రామ్ ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

ప్రతి జిల్లాలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, స్టేడియంలను నిర్మిస్తామని, క్రీడల కోటాలో డిఎస్‌సిలో 421 పోస్టులు ప్రత్యేకంగా కేటాయించామని రాష్ట్ర క్రీడల శాఖమంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి అన్నారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అఖిల భారత ఇంటర్ యూనివర్సిటీ పురుషుల సాఫ్ట్‌బాల్ పోటీల లీగ్ దశను మంత్రి బుధవారం ప్రారంభించారు. వర్సిటీ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఘనస్వాగతం పలికి అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన పలువురు దాతలను మంత్రి సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జాతీయ స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్న విషయం తెలియగానే ఎంతో ఆనందం కలిగిందని, మన రాష్ట్ర యూనివర్సిటీలు జాతీయ స్థాయిలో ర్యాంకింగ్ మెరుగుపరుచుకునే క్రమంలో ఎంతో పోటీతత్వంతో ముందుకు సాగడం గర్వంగా ఉందన్నారు. ఇందుకు కారణమైన వర్సిటీ అధికారులను అభినందించారు. సాఫ్ట్ బాల్ క్రీడ అమెరికాలో ప్రాచుర్యం పొందిన క్రీడ అని, మన దేశంలో ఇటీవల కాలంలో ఈ క్రీడ అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ పోటీ పడుతున్న క్రీడాకారులు జాతీయ స్థాయిలో మరింతగా రాణించేందుకు తోడ్పడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రీడల పట్ల ఎంతో చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. అందుకే గతంలో రెండు శాతం ఉన్న క్రీడల కోటా రిజర్వేషన్‌ను మూడు శాతానికి పెంచినట్లు తెలిపారు. ఇటీవల విడుదల చేసిన మెగా డిఎస్‌సిలో 16 వేలకు పైగా పోస్టులు ఉండగా క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా 421 పోస్టులను నోటిఫై చేసినట్లు గుర్తుచేశారు. పురుషుల సాఫ్ట్ బాల్ పోటీల్లో నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ, మహారాష్ట్రలోని సంత్ గాడ్గే బాబా అమరావతి యూనివర్సిటీ, కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్, కొల్హాపూర్ లోని శివాజీ యూనివర్సిటీ జట్లు తుదిదశకు చేరుకున్నాయి. గురువారం పరస్పరం ఈ జట్లకు జరగనున్న మ్యాచ్ లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానాలు ఖరారు కానున్నాయి. గురువారం సాయంత్రం 4 గంటలకు ముగింపు వేడుక ఘనంగా జరగనుంది. ఈ క్రీడా పోటీలు వర్సిటీ ఇన్ ఛార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, వర్సిటీ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, వివిధ యూనివర్సిటీల కోచ్‌లు, అంపైర్‌లు, రిఫరీల పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న యునివర్సిటీ ఉద్యోగులు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు

మున్సిపల్ కార్మికుల సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్లేందుకు వెనకాడబోమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. 60 ఏళ్ళు నిండిన మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషన్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి ఋన్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నా బుధవారం నాటికి మూడో రోజు కొనసాగింది. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, గత ఎనిమిది నెలల నుంచి ప్రభుత్వానికి మొరపెట్టుకున్న ఒక్క సమస్య కూడా పరిష్కారం చూపలేదన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలకు పరిష్కారం చూపించాలని కూటమి ప్రభుత్వ సంబంధిత మంత్రులకు అధికారులకు అనేక పర్యాయాలు అర్జీల రూపంలో తెలియజేశామన్నారు. అయినప్పటికీ ఫలితం కనిపించడం లేదన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేదంటే నిరవధిక సమ్మెకు పోయేదానికి కూడా వెనకాడబోమని తెలియజేశారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ ని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కే. పెంచల నరసయ్య, నగర గౌరవ అధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, సిఐటి నాయకులు ఎం మాలకొండయ్య, సుధాకర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కామాక్షమ్మ, అశోక్, దేశ మూర్తి, సుజాతమ్మ, వజ్రమ్మ, కొండమ్మ, భారతి, శ్రీనివాసులు, లోకేష్, నరసింహులు పాల్గొన్నారు.

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు

అల్లూరి సీతారామరాజుకు నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక ఎన్‌జిఓ భవనంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాష్ట్ర ఏ పి ఎస్ జి జి ఓస్ అసోసియేషన్ స్ఫూర్తితో విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు సీతారామ రాజు గురించి ప్రసంగించారు.జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు, కార్యదర్శి రామకష్ణ అసోసియేట్ అధ్యక్షులు ఆంజనేయ వర్మ ,కోశాధికారి ప్రసాద్ రెడ్డి ఆర్గనైజింగ్ కార్యదర్శి పెంచలయ్య ,ఉపాధ్యక్షులు కిరణ్ నగర అధ్యక్షులు రామకష్ణ రెడ్డి, కార్యదర్శి మార్కండేయులు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు

కలెక్టరేట్‌లో.. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగ నిరతిని అందరూ గుర్తెరిగి వారి వారి భాధ్యతల పట్ల మరింత కార్యోన్ముఖులు కావాల్సిన అవసరం ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో అమరవీరుడు, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జె సి కార్తీక్, డి ఆర్ ఒ ఉదయభాస్కర్, సెట్నెల్ సి ఇ ఒ నాగేశ్వరరావు పూల మాలలతో ఘన నివాళి అర్పించారు.

నేటి నుంచి పెంచలకోన బ్రహ్మోత్సవాలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి -రాపూరు

పెంచలకోన ఖ పెనుశిల లక్ష్మీ నసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 8 వ తేదీ నుండి 14 తేదీ వరకు అంగరంగవైభవంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. ఈ ఉత్సవాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.ఈ ఏడాది జయంతి, కళ్యాణం రోజులలో ఉచితం లడ్డు ప్రసాదం ఇవ్వనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహణ,పోలీస్ బందోబస్తు పై ఏర్పాట్లు పూర్తయ్యాయి.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రతి మండలం, ప్రతి పట్టణంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. భారత దేశం స్వర్ణపతకాలను సాధించాలంటే గ్రామీణ స్థాయి క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం నగరంలో సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో కార్మికులకు నిర్వహించిన క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతధిగా హాజరై య్యారు. ఆయన మీడి యాతో మాట్లాడుతూ 139వ మే డే దినోత్సవాన్ని పురస్కరించుకోని ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గం కార్మికుల దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకున్నారన్నారు పనిప్రాంతాలల్లోకాని కార్మికులకు ఆటవిడుపు కార్యక్రమాల్లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. అనంతరం సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మే డే సాంస్కృత్సవాల్లో భాగంగా సిఐటియు నగర కమిటీ ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు.ఈ పోటీలల్లో షుమారుగా 10 టీంలు పాల్గొంటున్నాయన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించి ఈ పోటీలల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌భీ పాల్గొని కబ్బడ్డీ క్రీడా పోటీలల్లో తలపడే జట్లను డ్రా పద్దతిలో ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు

లివర్ ఆరోగ్య సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం, సండే మార్కెట్ దగ్గర, డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి భవనంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ప్రపంచ లివర్ దినోత్సవం జరిగింది. చెన్నై నుంచి విచ్చేసిన, మూడు యూరోపియన్ ఫెలోషిప్ లు సాధించిన మొట్టమొదటి భారతీయుడు, లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ వైద్య నిపుణులు డాక్టర్ పివి రజినీకాంత్ పాల్గొని మాట్లాడారు. కాలే వ్యాధి నివారణకు పలు సూచనలు చేశారు. పీ.హెచ్.పీ నాయకులు డాక్టర్ పివి రజినీకాంత్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లా పీ.హెచ్.పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, నరసాపురం ప్రసాద్, ఉప్పలపాటి రామదాసు, బి. శంకర్రావు మార్కెటింగ్ మేనేజర్ హర్షవర్ధన్, ఏవో షేక్ జావీద్ ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో శ్రీవాసవి మాత జయంతి సందర్భంగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కోఆర్డినేషన్‌తో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో బుధవారం కందుకూరు నియోజకవర్గంలోని ఆర్యవైశ్య విద్యార్థులకు 2023-24 పది, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరములో ప్రతిభ కనబరిచిన వారిని ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులు నగర ఆర్యవైశ్య దాతల చేతుల మీదుగా వారిని ఘనంగా సన్మానించి బహుమతి అందజేశారు. డాక్టర్ ధర్మతేజ, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి గుర్రం సింగయ్య, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, వాసవి సేవాదళ్ ఉపాధ్యక్షులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు మాట్లాడారు. కందుకూరు మండల ఆర్యవైశ్య కన్వీనర్ మురారి శెట్టి సుధీర్ కుమార్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రెసిడెంట్ కోట వెంకట నరసింహం, కోటా కిషోర్, కంకణాల వెంకటేశ్వర్లు, కాకుమాని ప్రవీణ్ కుమార్, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ రవ్వా అరుణ, సెక్రటరీ పబ్బిశెట్టి వెంకట సురేష్ ఉన్నారు.

'టిఆర్ఆర్'లో అడ్మిషన్లు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు టి ఆర్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ షేక్ నాగూర్ వలి బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపిసి ,బైపీసీ, సీఈసీ, హెచ్ యీ సి, ఒకేషనల్ ఓ ఏ స్ , ఎం పి హెచ్ డబ్ల్యూ గ్రూపులలో అడ్మిషన్లు జరుగుతన్నాయని తెలిపారు.. తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వము ద్వారా సర్వేపల్లి రాధ కష్ణ కిట్ ఉచితంగా అందజేయునున్నట్లు వివరించారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఉలవపాడు : ఉలవపాడు మండల పాస్టర్స్ అసోసియేషన్, సరయుస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని డాక్టర్ రాజేష్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ చిరు వ్యాపారులకు, బాటసారులకు చల్లని నీటిని అందించటం ఆనందంగా సంతోషంగా ఉందన్నారు.

అన్నదాత సుఖీభవ

ప్రజాశక్తి-ఉలవపాడు : వ్యవసాయ శాఖలో ప్రతిష్టాత్మకంగా అన్నదాత సుఖీభవ కార్యక్రమం ఆన్లైన్ ప్రక్రియ ప్రారంభమైందని మండల వ్యవసాయ అధికారి తిరుమల జ్యోతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.14వేలు రైతు ఖాతాల్లో జమ అవ్వడం జరుగుతుంది. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలు వద్దకు వెళ్లి వారివారి కార్డు సరిచేసుకొని ఏమైనా తప

కూటమి పాలనలో స్కాములమయం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఆ పార్టీ తమ వారికి లబ్ధి చేకూర్చేలా అన్ని పథకాలను అమలు చేస్తుందని, దాంతో మూడు స్కీములు, ఆరు స్కాములుగా కూటమి పాలన సాగుతుందని వైసిపి నాయకులు విమర్శించారు. ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరులోని మేకపాటి కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా స్కీములు ఏర్పాటు చేసి బిసి మహిళలను ఆదుకుంటా మని చెప్పి పథకాలను ప్రవేశపెట్టారని, అయితే కుట్టు మిషన్ల శిక్షణ పేరుతో భారీ అవినీతికి తెరలేపారన్నారు. మహిళలకు కుట్టు శిక్షణ కోసం రూ.221.08 కోట్లు కేటాయించారని, అందులో ఒక్కో మహిళకు శిక్షణ కోసం రూ.3వేలు, మిషన్ కోసం రూ.4300 ఇచ్చారని, ఆ విధంగా చూసు కుంటే రూ.75.06 కోట్లే అవుతుందని, మిగిలిన రూ.154 కోట్లకు లెక్కే లేకుండా పోయిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో బిసిలకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారని, ఈ-బిసి నేస్తం, జగనన్న చేయూత, ఆసరా, అమ్మఒడి పథకాల ద్వారా మహిళలకు ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. ఆత్మకూరు పట్టణం, రూరల్ రెండు కేంద్రాలు పట్టణంలోని శిక్షణ అందిస్తున్నాయని, పరిశీలించేందుకు వెళితే అక్కడ 5 నుండి 6 మంది మహిళలే శిక్షణ తీసుకుంటున్నట్లుగా ఉందని, లెక్కల్లో మాత్రం ఎంతోమంది శిక్షణ తీసుకుంటున్న ట్లుగా చూపుతున్నారని, ఇలా అవినీతిమ యంగా పాలన సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తే ఇలా ఎందుకు చేశారని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం 45 రోజులకు దాదాపు 360 గంటల శిక్షణ ఇవ్వాల్సి ఉంటే కేవలం 135 గంటలు మాత్రమే శిక్షణ ఇస్తున్నారని, అందులో కూడా ట్రైనింగ్ కిట్లు ఇవ్వడం లేదన్నారు. టెండర్ల ప్రక్రియలోనూ ప్రి బిడ్లో మొత్తం 65 కంపెనీలు పాల్గొంటే 56 సంస్థలను ముందే తిరస్కరించారన్నారు. వారికి అనుకూలంగా టెండర్ల ప్రక్రియ చేపట్టారని, దాంతో వారి అవినీతికి మార్గం సుగమమం చేసుకున్నారని విమర్శించారు. ఆత్మకూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తమ కూటమి నేతలు ఏం చేస్తున్నారో గమనించాలని, మట్టి మాఫియాగా ఏర్పడి మైనింగ్ చేస్తూ ప్రయివేట్ లేఅవుట్లకు మట్టిని తోలి లక్షలు సంపాదిస్తున్నారని, ఎంత యథేచ్ఛగా దోపిడీ సాగిస్తున్నారో తెలుసుకోవాలని, అవినీతి ఏ స్థాయిలో ఆత్మకూరులో జరుగుతుందో పరిశీలించాలన్నారు. సింహాచలంలోని అప్పన్న గుడి వద్ద గోడ కూలి ఏడుగురు చనిపోయారని, అసలు పిల్లర్లు లేకుండా నిర్మాణం చేయడం, అమాత్యులు, అధికారు లందరూ పరిశీలించామని చెప్పిన తరువాత కూడా ఇలాంటి దురదృష్టకర సంఘటన జరగడం, మీ శాఖ పరిధిలో ఇది జరగడం అవినీతికి, దోపిడి అన్ని ప్రజలంతా గమనిస్తు న్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకోలేదు కానీ బిసిలను అడ్డం పెట్టుకుని భారీ దోపిడికి పాల్పడుతోందన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నేతలు

పాకిస్తాన్కు సమయం ఆసన్నమైంది..

మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఉగ్రవాదులతో చేతులు కలిపి భారత దేశాన్ని దెబ్బతీయాలని చూస్తున్న పాకిస్తాన్కు గట్టిగా బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం సోమశిలలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రపంచంలో అగ్రదేశాల సరసన నిలుస్తున్న భారతదేశాన్ని దెబ్బ తీయాలని పాకిస్తాన్ ఉగ్రవాదులతో చేతులు కలిపి కాశ్మీర్లోని పహల్గాంలో ఉగ్ర దాడికి పాల్పడిందన్నారు. ఆ దాడిలో 28మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ తగిన మూల్యం చెల్లించుకునే సమయం ఆసన్నమైందన్నారు. భారతీయులంతా దేశ భద్రత కోసం సంఘటితం కావాలన్నారు. మంగళవారం అర్ధరాత్రి పాకిస్తాన్ భూభాగంపై ఉన్న ఉగ్రవాదులను ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం అంతమొందించడం భారతదేశాన్ని సగర్వంగా తలెత్తుకునేలా చేసిందన్నారు. ఉగ్రవాదం అంతమయ్యేంత వరకు ఇది కొనసాగాలన్నారు. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశమని, ఆర్థికంగా అన్ని రంగాల్లో బలపడుతున్న భారతను దైర్యంగా ఎదుర్కోలేక ఉగ్ర దాడులను పాకిస్తాన్ ప్రోత్సహిస్తుందని ఆనం అన్నారు. దేశ ప్రజలందరూ దేశ రక్షణ కోసం ఏకతాటిపై నిలబడి పాకిస్తాన్ దాడులను, కుట్రలను తిప్పి కొట్టేందుకు సంఘటితం కావాలన్నారు.

రేషన్షాపులో తనిఖీలు

ప్రజాశక్తి-దగదర్తి : మండల పరిధిలోని మనుబోలుపాడులోని రేషన్షాపును రెవెన్యూ ఇన్స్పెక్టర్ శివ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాపులో ఎటువంటి అక్రమాలకు పాల్పడిన అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకో బడతాయని వారు తెలిపారు. రేషన్ బియ్యం రేషన్ కార్డు దారులకు ఇవ్వకుండా బియ్యాన్ని బయట వ్యక్తులకి అమ్మినట్లు తెలిస్తే అట్టివారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని వారు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓ శ్రీనివాసులు, వీఆర్ఏ, తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలే హత్యకు కారణం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

పోలి నాయుడు చెరువు గ్రామానికి చెందిన పెద్ద రత్తి హత్యకు పాత కక్షలే కారణమని సిఐ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం పోలీస్ స్టేషన్లో సిఐ శ్రీనివాసులు రెడ్డి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెలలో జరిగిన పెద్ద రత్తి హత్యపై ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ టీం ను ఏర్పాటు చేయగా మంగళవారం పోతిరెడ్డి పాలెం ఆర్చి సమీపంలో ఎనిమిది మంది ముద్దాయిలను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుండి వివరాల సేకరించి సంఘటన స్థలానికి చేరుకొని హత్య కు ఉపయోగించిన రెండు కర్రలు, కత్తిని స్వాధీనపరచు కున్నామన్నారు. హత్య కేసులో ఆరుగురు ముద్దాయిలు వారిని ప్రోత్సహించిన దాదాసాహెబ్, షెల్టర్ ఇచ్చిన వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. పోలినాయుడు చెరువు గ్రామానికి సంబంధించి ఇరుగ్రూపుల ఆధిపత్యం పై కొంతకాలంగా ఉన్న కక్షలే హత్యకు కారణమని రాజకీయాలకు ఎటువంటి సంబంధం లేదని ఆయన వివరించారు. చాకచక్యంగా నిందితులను అరెస్టు చేసిన స్పెషల్ టీంకు రివార్డులు ప్రకటించారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి : హైకోర్టు వారి ఆదేశాలమేరకు బుధవారం కావలి సీనియర్ సివిల్ జడ్జి వి.గీతావాణి సూచనల మేరకు కావలి మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో వెంగళరావు నగర్ వరదా రెడ్డి పార్కు దగ్గర ఉన్న 25వ వార్డు సచివాలయం దగ్గర మేడే వారోత్సవాల్లో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది ఇనకం సాయి ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఫైనాన్స్ సంస్థల దగ్గర డబ్బులు తీసుకొనేటప్పుడు ఖాళీ ప్రామిసరి నోటు, ఖాళీ చెక్కులు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే చెడు అలవాట్లు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సాయి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ యం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ పేదలకు ఉచితంగా న్యాయ సహాయం లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చని, తమ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి : మిస్టర్ సింహపురి స్ట్రీమెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ -25"కు సంబంధించిన పోస్టర్ను ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ జూన్ 22వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటల నుండి కావలి పట్టణంలోని బృందావనం కాలనీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాయామంలో నవజీవన ప్రమాణాలు చిరుస్థాయిని, క్రమశిక్షణ మన జీవనాన్ని మారుస్తుందని, వ్యాయామం మనజీవితాన్ని మారుస్తుందన్నారు. మనిషి జీవితంలో ఆరోగ్యం ఎంత ముఖ్యమో అలాంటి ఆరోగ్యం మన సొంతం కావాలంటే మనం నియమ నిష్టలతో - ప్రణాళిక బద్ధంగా ఆహార వ్యాయామం కొనసాగించడం ద్వారా అందమైన శరీర సౌష్టవం – ఆరోగ్యకరమైన జీవనంతో ముందుకు కొనసాగి జీవన ప్రమాణాలు పెరిగి ఉల్లాసంగా జీవితాన్ని సాగించ గలమన్నది యదార్థ సత్యమన్నారు. ఎవరైనా డబ్బు సంపాదించడం తేలికే కానీ, ఆరోగ్యాన్ని పొందటం అంత తేలికైన పనికాదన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ కె.మాధవరెడ్డి, ఆర్గనైజర్ సెక్రటరీ బి. జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఉదయగిరి : విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12-1సి ప్రకారం ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25శాతం ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ-1 షేక్ మస్తాన్ వలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతికి సంబంధించి 25శాతం ఉచిత ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. ఈ ఉచిత ప్రవేశాలకు అర్హులు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాథ పిల్లలు, హెచ్ఐవి బాధిత పిల్లలు, ఎస్సి ఎస్టి వర్గాలకు సంబంధించిన పిల్లలు ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీ, బిసి, ఒసి పిల్లలు అర్హులన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరిక ఆదాయం రూ.1,20,000, పట్టణ ప్రాంతాలలో రూ.1,44,000 సంవత్సరిక ఆదాయం లోపల ఉండాలని మే15 వరకు గ్రామ, వార్డు సచివాల యాల్లో, ఇంటర్నెట్ సెంటర్లలో మండల విద్యాశాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపిక విధానం లాటరీ ద్వారా జరుగుతుందని తెలిపారు.

వైసిపి హయాంలో విదేశీ విద్య పథకం నిర్వీర్యం

ప్రజాశక్తి-కోవూరు : విదేశాలలో ఉన్నత విద్యకోసం వెళ్లే విద్యార్థులకు సాయం చేయడానికి అంబేద్కర్ విదేశీ విద్య పథకంను టిడిపి ప్రవేశపెట్టి అమలుచేస్తే, అనంతరం గద్దెనెక్కిన వైసిప ప్రభుత్వం ఆ పథకంను నిర్వీర్యం చేసిందన్నారు. కోవూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖర్ల సమావేశంలో టిడిపి నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి మాట్లాడారు. 2014-19 మధ్య అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం విదేశాలలో ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం కోసం అంబేద్కర్ విదేశీ విద్యా పథకంను ప్రవేశ పెట్టి అమలు చేసిందన్నారు. ఈ పథకం వల్ల అనేక మంది పేద విద్యార్థులు ప్రభుత్వం ఆర్థికసాయంతో విదేశాలలో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు వెళ్లారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేసిందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు తప్పనిసరి పరిస్థితులలో ఈ పథకానికి జగనన్న విదేశీ విద్యా పథకం పేరు మార్చి, ఆచరణ సాధ్యం కాని అనేక నిబంధనలు పెట్టి ఈ పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. 2019కి ముందు ఈ పథకం కింద ఎంపికై విదేశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు తదుపరి చేయాల్సిన ఆర్థిక సహాయం కూడా వైసిపి ప్రభుత్వం చేయక పోవడంతో విద్యార్థులు తమ సొంతడబ్బులతో మిగిలిన చదువులు పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఈ పథకానికి అంబేద్కర్ విదేశ విద్యా నిధి అనిపేరు పెట్టాలని, ఈ పథకం కింద విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదువుకొనే ఎస్సి ఎస్టి విద్యార్థులకు రూ.25 లక్షలు, బిసి మైనార్టీ విద్యార్థులకు రూ.20 లక్షలు, ఈబిసి, కాపు విద్యార్థులకు రూ.15 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

నేడు లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని శాంతినగర్లో ఉన్న పశు వైద్యశాలలో పశు 'సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోవూరు పరిధిలో ఉన్న పాడి రైతులు తమ లేగదూడలు తీసుకుని వచ్చి ఈ ప్రదర్శనలో పాల్గొని బహుమతులు పొందాలని తెలియజేశారు. లేగదూడలు సంబంధించి ఉచితంగా మందులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూతన రేషన్కార్డులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి కొత్తగా రేషన్ కార్డుల కొరకు సంబంధిత గ్రామాల్లో ఉన్న గ్రామ సచివాలయాల్లో అర్హత కలిగిన లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ నిర్మలానంద బాబా తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఉన్న రేషన్ కార్డుల్లో అదనంగా సభ్యులను చేర్చుకునే అవకాశం, మృతి చెందిన వారు, వివాహం చేసుకుని వెళ్లిన వారు సభ్యులను తొలగించే అవకాశం, అదేవిధంగా రేషన్ కార్డులో అడ్రస్సులు చేసుకునే అవకాశం కూడా ప్రస్తుతం ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం వెంగళరావు నగర్లోని నవ వికాస్ వద్ద, వెంగళరావు నగర్లోని శివాలయం సమీపంలోని వీర బ్రహ్మేంద్ర స్వామివారి దేవస్థానాల్లో జరిగిన వీర బ్రహ్మేంద్ర స్వామివారి ఆరాధన మహోత్సవాల్లో కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి బుధవారం పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. స్వామి వారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మొగిలి కల్లయ్య, పోతుగంటి అలేఖ్య, పోట్లూరి శ్రీనివాసులు, శానం హరి, నాయుడు రాం ప్రసాద్, తిరివీధి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీరు విడుదల చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సోమశిల నీరు విడుదల

ప్రజాశక్తి-అనంతసాగరం : సోమశిల జలాశయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి గంగమ్మ తల్లికి చీర సారె జలహారతి సమర్పించి నీటిని విడుదల చేశారు. రెండో పంటకు నార్థఫీడర్ కెనాల్ ద్వారా 300క్యూసెక్కులు, డెల్టాకు 500 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. జిల్లాలో రెండోపంట రబీకి సోమశిల జలాశయం నుంచి నీటిని విడుదల చేయడంపై ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, రామనారాయణ రెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు కిమ్స్ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు, పాల్గొన్నారు.

మన్యం వీరుడు వర్ధంతి

ప్రజాశక్తి - కావలి

స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషు వారికి ఎదురొడ్డి పోరాడిన త్యాగశీలి అల్లూరి సీతారామ రాజు యువతకి స్ఫూర్తి ప్రదాత అని లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వెంగళరావు నగర్ ప్రభుత్వ గిరిజన గురుకుల బాలుర పాఠశాల ఆవరణంలో బుధవారం అల్లూరి సీతారామరాజు నూట ఒకటవ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాలకొండారెడ్డి మాట్లాడు తూ అల్లూరి సీతారామరాజు దేశం కోసం అసువులు బాసి నేటికి నూరు ఏళ్ళు నిండినాయి అని తెలిపారు. గిరిజనుల హక్కుల కోసం బ్రిటిష్ పాలకుల దోపిడీకి వ్యతిరేకం గా మన్యం ప్రాంతంలో పోరాడిన యోధుడని వారి దేశ భక్తిని కొనియాడారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ శ్యాంసుధాకర్ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిరంజని, మనోహర్ తదితరులు పాల్గొని ఘనమైన నివాళులుఅర్పించారు. విద్యార్థులు, యువత సామాజిక స్పృహతో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి సమాజ హితవుకు పాల్పడాలని కోరారు.

కావలిలో

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ శ్రీహరిరెడ్డి ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడు చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి, ఎపిఎం సుబ్బరాజు, సీనియర్ అసిస్టెంట్ సురేష్, టైపిస్ట్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ రాధ, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమర యోధులు దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 53వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. అనంతరం 10వ రోజు హాజరైన విద్యార్థులతో మహనీయుల జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా ఇన్ఛార్జ్ గ్రంథ భాండాగారి నారాయణ రావు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుండే మహనీయుల జీవిత చరిత్రలు తెలుసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. తదుపరి ఆంగ్లంలో రైడిల్స్ లాజికల్ రీజనింగ్ స్పోకెన్ ఇంగ్లీష్ పై అవగాహన కల్పించారు. అనంతరం లెమన్ అండ్ స్పూన్ స్కిప్పింగ్ వ్యాయామ ఎక్సర్సైజులు నిర్వహించారు.

వెంకోజికి అంతిమవీడ్కోలు

వెంకోజి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : సిపిఎం సీనియర్ నాయకులు వంజీవాక వెంకోజి అంతిమ యాత్రలో బుధవారం సిపిఎం జిల్లా నాయకులు పాల్గొన్నారు. బుచ్చిరెడ్డి పాలెం మండలం ఆర్ఆర్ నగర్లోని వెంకోజి అంతిమయాత్రలో జిల్లా కార్యదర్శి మూలం రమేష్, చంద్ర రాజగోపాల్, జొన్నలగడ్డ వెంకమరాజు, ఎం.పుల్లయ్య, జిల్లా వ్యవసాయ సంఘం నాయకులు పులిగండ్ల శ్రీరాములు, పలువురు జిల్లా కమిటీ నాయకులు పాల్గొని ఆయన భౌతికకాయానికి ఎర్ర జెండాను కప్పి నివాళులర్పించారు. అనంతరం ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

రైతులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలో ప్రస్తుతం వరినారు మడులు మూడవ వంతు పూర్తయ్యాయని దానిని సంబంధించి సస్యరక్షణపై రైతులు వ్యవసాయ శాఖ సలహాలు సూచనలు తీసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. కోవూరులోని పలు పొలాలను బుధవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు చైతన్య, రాజశేఖర్ ఉన్నారు.

మధుసూదన్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కావలి

వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్. ఖాదర్బాషా ఆధ్వర్యంలో ఇటీవల పహల్గామ్లో ఉగ్ర దాడిలో బలైన సోమిశెట్టి మధుసూదనరావు స్వగృహానికి వెళ్లి, మధుసూదన రావు చిత్రపటానికి పుష్పమాలను సమర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, బాధతప్త మనసు తోనివాళులర్పించారు. ఇటీవల కావలి వాసులు యువ సాఫ్ట్వేర్ ఇంజనీర్ సోమిశెట్టి మధుసూదన్ కుటుంబం ఎంతో సంతోషంగా కాశ్మీర్కు విహార యాత్రలకు వెళ్లిన నేపథ్యంలో ఉగ్రవాదులు, పహల్గామ్ దాడుల్లో, అమానుషంగా, విచక్షణ రహితంగ కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో వివాదరహితులు, సౌమ్యులు, మధుసూదన్ రావు దైనందిక స్థితిలో ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. మాధసూదనరావు భార్య కామాక్షి, తల్లిదండ్రులు సోమిశెట్టి తిరిపాలు, పద్మావతి, పిల్లలను పరామర్శించారు. మనోనిబ్బరంగా ఉండాలని, ప్రఘాడ సానుభూతి తెలియజేశారు. జనసేన సీనియర్ నాయుకులు సమ్మను వెంకట సుబ్బయ్య, స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్. ఖాదర్ బాషా, డాక్టర్ రమణయ్య, వాయిస్ ఆఫ్ ముస్లీమ్ మైనారిటీ మొఘల్ సలీం బేగ్, మీకోసం దిలీప్ కుమార్, రత్నమ్మ ఫౌండేషన్ ఎం వి ప్రసాద్ రావు, ఆపద్బాంధవ సేవా ట్రస్ట్ దామ మధుసూదన్ రావు, హ్యాపీ సేవాసంస్థ సయ్యద్ ఘనిబాషా, మహబూబ్ బాషా, ఎల్ఐసి టైం టు హెల్ప్ రమేష్, ఓట్టురు మస్తానయ్య పిఎంపి, సామాజిక కార్యకర్తలు, ఎం.మాలకొండారెడ్డి, శారద, విశ్రాంత ఉద్యోగి, ప్రభాకర్, విజయ్ దేవరకొండ పాల్గొన్నారు.

బాలికల వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని రేవూరు ఎస్సి కాలని అంగన్వాడీ కేంద్రంలో కిశోరి బాలికల వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అనంతసాగరం ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉండే కిశోరి బాలికలకు చదువు పైన, పోషణ పైన, వారి భవిష్యత్తులో తీసుకోవలసిన జాగ్రత్తలు చదువుల అంశాలపై అవగాహన కల్పించారు. వారిలో శారీరకంగా వచ్చే మార్పులు గురించి అవగాహన కల్పించారు. బాలికలు ఉన్నత స్థాయి చదువులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగమణి, రేవూరు అంగన్వాడీ వర్కర్స్ విజయ లక్ష్మీ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

పైలాన్ కూల్చివేత నిజమా..కాదా..

మాట్లాడుతున్న కూటమి నాయకులు

ప్రజాశక్తి-కావలి

అమృత్ పథకం పైలాన్ను కూలుస్తానని చెప్పి మరీ కూల్చింది మాజీ ఎంఎల్ఎ కాదా.. అని తెలుగు తమ్ముళ్ల ప్రశ్నించారు. బుధవారం కావలి పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు మధుబాబు నాయుడు, తిరివీధి ప్రసాద్ దేవరకొండ శ్రీను, జనసేన నాయకులు సిద్ధు తదితరులు మాట్లాడారు. అప్పటి కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు సహకారంతో 2019లో కావలి పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టిన అమృత్ పథకం పైలాన్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ 11, 2020న దానిని ధ్వంసం చేసి నామ రూపాలు లేకుండా, కనీసం శిథిలాలు కనబడకుండా వైసిపి నాయకులు, కొంతమంది విలేఖరులు చేయడం జరిగిందని తెలిపారు. పైలాన్ కూల్చిన విలేకరులపై కేసులు పెట్టకూడదా? విలేఖరులు అయితే కేసులు ఉండవా అని ప్రశ్నించారు. పైలాన్ ధ్వంసం చేసింది నిజమా కాదా మీ ప్రమేయంతో జరగ డంతో ఆ కేసు దర్యాప్తు జరగకుండా కేసును మూసివేసింది మీరు కాదా అని అన్నారు. 2019 - 24 మధ్య కాలంలో కావలిలో అసలు భారత రాజ్యాంగం నడిచిందా అని ప్రశ్నించారు. దళితులపై, విలేకరులపై, సామాన్యుల పై దాడులు చేయించింది మీరు కాదా అని అన్నారు. ప్రశ్నించిన అనేకమంది టిడిపి నాయకులపై అనేక కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులపై ఉన్న అక్రమ కేసులు, వైసిపి నాయకులపై ఉన్నాయా అని ప్రశ్నించారు. వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారని, 2019-24 ఒక చీకటి అధ్యాయం అని తెలిపారు. మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్కుమార్ రెడ్డి నటన చూస్తే కమలహాసన్ కూడా ఆశ్చర్యపోతాడని అన్నారు. డబ్బే వ్యామోహం గా పనిచేసిన ఏకైక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అని అన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కావలికి చేసిన అభివృద్ధి శూన్యం అని మండిపడ్డారు. పోలీస్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుండి డబ్బులు వసూలు చేసిన ఘనుడు ప్రతాప్ రెడ్డి అని తెలిపారు. కరోనా సమయంలో వ్యాపారస్తుల నుండి భారీగా వసూళ్లు చేసిన ఘనత ప్రతాప్ రెడ్డిది అని అన్నారు. రౌడీయిజం గురించి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఉంటే ప్రజలు ముక్కునవేలు వేసుకుంటున్నారని, వడ్డీతో సహా చెల్లించడానికి తిరిగి ఆయన గెలిస్తే కదా అని అన్నారు. కూటమి పాలనలో 10 నెలల్లోనే అవినీతి జరుగుతుందని చెప్పటం విడ్డూరమన్నారు. కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి సొంత నిధులు వెచ్చించి ప్రజాసేవ చేస్తున్నారని, కక్ష తీర్చుకునే కార్యక్రమాలు చేపట్టడన్నారు. పది సంవత్సరాలుగా మాజీ ఎంఎల్ఎ చేయలేని అనేక అభివృద్ధి పనులను కావ్య క్రిష్ణారెడ్డి 10 నెలల కాలంలోనే చేశాడని గుర్తు చేశారు. కావలిని అభివృద్ధి చేయడమే ఎంఎల్ఎ లక్ష్యమని, అందుకే పైలాన్ కూల్చిన చోటే 100 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను స్థాపించాడని తెలిపారు. జలదంకి ఎంపీపీగా క్రిష్ణారెడ్డి పోటీ చేసే సమయంలో పూర్తి మెజారిటీ ఆయనకే ఉన్నదని, కిడ్నాప్లు చేసింది ఎవరో అందరికీ తెలుసన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఉన్నదని, ప్రతి పథకం అమలు చేసి తీరుతుందని తెలిపారు. పైలాన్ ఘటనతో సంబంధం లేకుంటే మాజీ ఎంఎల్ఎ ప్రతాప్ కుమార్ రెడ్డి శివాలయం కోనేరులో మునిగి చెప్పాలన్నారు. లేకుంటే వెంటనే పోలీసులకు సరెండర్ కావాలన్నారు. ఇంటింటికి ఎమ్మెల్యే కార్యక్రమంతో కావలి పట్టణ ప్రజలు ఎంఎల్ఎకు బ్రహ్మారథం పడుతున్నారని తెలిపారు. రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, హజరత్, వల్లెరి వెంకట కిరణ్, అక్కిలగుంట సూర్య ప్రకాష్, అభిసాగర్, ఆలా శ్రీను, అన్సర్, ఖమర్ బాబు, పైడి శ్రీహర్ష, అల్ హర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు : ప్రజా విజ్ఞప్తుల దినోత్సవం సందర్భంగా ప్రతి సోమవారం వివిధ మండలాల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అధిక సంఖ్యలో అర్జీదారులు వస్తున్నారని, దానిని దృష్టిలో పెట్టుకుని ప్రతినెలా రెండు మండలాల్లో డివిజన్ స్థాయిలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డిఒ నాగసంతోష్ అనూష తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా విజ్ఞప్తుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించిన ప్రతినెలా రెండు మండలాల్లో ఈ విధమైన కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. దాని వల్ల మండలాల నుంచి జిల్లాకు వచ్చే అర్జీదారుల సంఖ్య తగ్గుతుందన్నారు. నెల్లూరు డివిజన్లో ఏ మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేది ముందుగా ఆయా మండల ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ పరిష్కార వేదికలో భూములకు సంబంధించిన రీసర్వే ఇతర సమస్యలను ఈ వేదిక ద్వారా సులువుగా పరిష్కరించుకునే అవకాశం కల్పించడం జరిగిందని, దీనిని ప్రజలు పూర్తిస్థాయిలో ఉపయోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీహరిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ నానర్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, సర్వేయర్ డీటీ మధుసూదన్రావు, ఎలక్షన్ డీటీ రవి, సర్వేయర్ రమేష్ గౌడ్, గ్రామ రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఎఎస్పేట

మండలంలోని రాజవోలు సచివాలయాన్ని పొను గోడు సర్పంచ్ పద్మయ్య నాయుడు ఆకస్మికంగా సందర్శించారు. నూటికి నూరు శాతం హాజరు కావడం, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గురించి, ప్రతి విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తమ వంతు కృషి చేస్తూ, ప్రజల మన్నలను పొందాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దుత్తలూరు

మండలంలోని తెడ్డుపాడు హైవే సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని బుధవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మృతి చెందిన వ్యక్తి తెడ్డుపాడు గ్రామానికి చెందిన జంపు వెంగయ్య (60)గా స్థానికులు గుర్తించారు. ఆయన మానసిక స్థితి బాగోలేక చాలా కాలం నుండి అక్కడ ఉన్న సత్రంలో ఉండేవారని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, ఎస్ఐ పి.ఆదిలక్ష్మి ఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన జంపు వెంగయ్య అనే వ్యక్తికి భార్య ఒక కొడుకు ఉన్నారనీ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరికి తరలించారు.

వ్యాయామం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-కొడవలూరు

నేటి బాలలే రేపటి పౌరులు అని చిన్నతనంలోనే ప్రతిరోజు అర్ధగంట వ్యాయామం చేయడం అలవాటు చేసుకుంటే మంచి ఆరోగ్యం పాటు క్రమశిక్షణ కలిగిన యువతగా రాణిస్తారని కొడవలూరు లైబ్రేరియన్ రాజేశ్వరి అన్నారు. వేసవి శిక్షణ శిబిరం తరగతుల్లో భాగంగా బుధవారం నాడు కొడవలూరు లైబ్రరీలో పిల్లలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ధ్యానం యోగ చేయడం ద్వారా జ్ఞాపకశక్తి ఏకాగ్రత పెరుగుతుందన్నారు. పిల్లలకు నీతి కథలు చదివించటం తెలుగు పదాలు డిక్టేషన్ పెట్టటం ల్యాప్ట్యాప్లో నీతి కథలు వినిపించారు.

చెక్బుక్స్ పోయినవి

కోటకొండ శామ్యూల్, తండ్రి నరసింహారావు, కందుకూరు SBI దగ్గర నుండి ఇంటికి వెళ్తున్న సమయంలో ద్విచక్ర వాహనంలో పెట్టి ఉన్న నా రెండు చెక్ పుస్తకాలు No: 105341 - 105390, 661331 - 661380 నెంబర్లు గల చెక్బుక్స్ మరియు ఇంటి తాళాలు మెడిసిన్ గల ఒక బ్యాగు ఎక్కడో పడిపోయినవి. ఎవరికైనా దొరికినచో క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

ఇట్లు
కోటకొండ శామ్యూల్, తండ్రి నరసింహారావు,
H.No: 3-57, నేకునాంపురం గ్రామం,
వలేటివారిపాలెం (మం), ఎస్ పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా,
సెల్ నెంబర్: 9133713372.

In The Court of The principal Civil Judge (Junior Division), Kavali
O.S.No. 346/2022

Between :
Thalacheru Prasanthi,
and 2 others - వాదులు
Vs
Kommi Ramadevi,
and 3 others - ప్రతివాదులు

To,
D4) **పాటిబండ్ల అశ్వని, భర్త ఓంకార్,**
తండ్రి కొమ్మిసుబ్రహ్మణ్యం, వెస్ట్ గుడ్లదొన గ్రామం,
కలిగిరి మండలం,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. అనువారికి,

ఈ నంబరున వాది మీపై దావా దాఖలు చేసుకొని ఉన్నందున మీకు నోటీసు నిమిత్తం వాయిదా **తేది: 09-05-2025**కి వేసి ఉన్నారు. కావున మీరు ఆ దినం **పగలు 10.30.గం.లకు** పై కోర్టు వారి ఎదుట మీరుగాని, మీ వకీలు ద్వారాగాని హాజరై, మీకు గలఅక్షేపణలుతెలుపుకొనవలెను.లేని యెడల మీ పరోక్షమందు ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 09 -05-2025

ఇట్లు,
జి.మనోరమ,
వాదుల తరుపున్యాయవాది, కావలి.
సెల్: **9490777138**